క్లుప్తంగా

సన్మానం

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత తొలిసారి నియోజకవర్గానికి వస్తున్న కవ్వంపల్లి సత్యనారాయణకు ఆదివారం బెజ్జంకి క్రాసింగ్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గజమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మానాల రవి, టీవీరావు, నాగరాజు, ప్రభాకర్, మల్లేశం, శీలం నర్సయ్య, శరత్, నరేందర్‌రెడ్డి, రాజు, సీపీఐ నాయకులు మధు, రూపేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హుస్నాబాద్‌కు మంత్రి పొన్నం రాక

హుస్నాబాద్: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ నియమితులైన తర్వాత మొదటిసారి సోమవారం హుస్నాబాద్‌కు రానున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు బస్వాపూర్‌కు చేరుకుంటారు. 3 గంటలకు హుస్నాబాద్ బస్ డిపో క్రాసింగ్‌లోని అనభేరి విగ్రహం వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి కాంగ్రెస్ శ్రేణులతో ఊరేగింపుగా బయలుదేరి సాయంత్రం 4 గంటలకు అంబేద్కర్ చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

కాంగ్రెస్‌లో చేరిక



వహీద్‌ఖాన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు వహీద్‌ఖాన్ ఆదివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అర్షద్, పూజల గోపికృష్ణ, మున్నా, ఇమ్రాన్, సజన, రితేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.


పనులు పూర్తికాని బిల్లులు పాస్ చేయొద్దు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు పూర్తి కాకుండానే బిల్లులు తీసుకుంటున్నారని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. ఆదివారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు కాంట్రాక్ట్ పొందిన పనులకు సంబంధించిన బిల్లులను మంజూరు చేసుకుంటున్నారని ఆరోపించారు. పనులు పూర్తి కాకున్నప్పటికీ పనులు అయినట్లుగా లెక్కలు చూపించి తారుమారు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సిద్దిపేట యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గయాజుద్దీన్, ఎన్‌ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రాశాద్, మాజీ మైనార్టీ ఉపాధ్యక్షులు ఇస్మాయిల్, నజ్జు, ఫయాజ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కును అందజేస్తున్న దేవి రవీందర్

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామానికి చెందిన దస్తగిరి, యాదయ్యకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 45 వేల చెక్కులను ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్ మంజూరులో గత ప్రభుత్వం ఎలాంటి పైరవీలకు తావివ్వక పోవడంతో పేదలు చాలా వరకు కార్పొరేట్ వైద్యం పొందారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అలాగే కొనసాగేలా చూడాలని కోరారు.

బస్సులు రావు..
వినియోగంలోకి తేరు!



ధాన్యపు గిడ్డంగిని తలపిస్తున్న వర్గల్ ప్రయాణ ప్రాంగణం

- గిడ్డంగిని తలపిస్తున్న బస్టాండ్
- ప్రయాణికులకు తప్పని వెతలు

వర్గల్(గజ్వేల్): ప్రయాణికులు కూర్చోవాల్సిన చోట నిల్వచేసిన ధాన్యం బస్తాలు.. బస్సులు నిలపాల్సిన చోట ఆరబోసిన ధాన్యం. దీంతో వర్గల్ ప్రయాణ ప్రాంగణం ఓ వైపు ధాన్యపు బస్తాలు, ఆరబోసిన ధాన్యం, ప్రైవేటు వాహనాలతో ధాన్యపు నిల్వ గిడ్డంగిని తలపిస్తోంది. ప్రయాణికులకు ఎండా, వాన నుంచి రక్షణ కల్పించే షెల్టర్ లక్ష్యం నీరుగారిపోతుంది.

వర్గల్‌లో ప్రయాణ ప్రాంగణం కోసం సర్వేనంబర్ 991లోని పలు దుకాణాలను తొలగించి ఆ స్థలాన్ని ఆర్టీసీకి అప్పగించారు. రూ. 50 లక్షల నిధులతో దీని



నిల్వచేసిన ధాన్యం బస్తాలు

నిర్మాణ పనులకు 2018 జనవరి 29న అప్పటి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షణలో కార్యాలయ గది, షట్టర్లతో కూడిన రెండు స్టాళ్లు, ప్రయాణికులు కూర్చునేందుకు సీట్లు, బస్సులు నిలిచేందుకు ప్లాట్‌ఫారాలు, టాయిలెట్ బ్లాకులు, విద్యుద్దీకరణ పనులు చేపట్టి సౌకర్యవంతంగా ప్రయాణ ప్రాంగణం నిర్మించారు. 2020 జూలై 30న అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. అందులోకి నాటి నుంచి నేటి వరకు ఆర్టీసీ బస్సులు అడుగుపెట్టిన దాఖలాలు లేవు. బస్సులు రోడ్డు మీద నుంచే వెళ్లిపోతుండడంతో ప్రయాణ ప్రాంగణం నిర్మాణలక్ష్యం నీరుగారిపోయింది. బస్సులు రాకపోవడంతో ఆర్టీసీ బస్టాండ్ ప్రైవేట్ వ్యక్తుల ఆస్తి అన్నట్టుగా మారింది. ప్రాంగణం ప్లాట్ ఫాంలను ప్రైవేటు వాహనాల అడ్డాగా మార్చారు. ప్రయాణికులు కూర్చునే ప్రాంగణంలో గిడ్డంగిని తలపించే విధంగా ధాన్యం బస్తాలు నిల్వచేశారు. ఆర్టీసీ అధికారులు బస్టాండ్ వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఈ పరిస్థితి నెలకొనగా, బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులకు గతం మాదిరిగానే రోడ్డే దిక్కైంది.

'మహాలక్ష్మి'తో మహిళలకు మేలు

ఆర్డీఓ బెన్ షాలెమ్

హుస్నాబాద్: ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు వినియోగించుకోవాలని ఆర్డీఓ బెన్ షాలోమ్ కోరారు. ఆదివారం పట్టణంలోని బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, జీరో టికెట్లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. మహిళలకు ఆర్డీనరి, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. వయసుతో నిమిత్తం లేకుండా అమ్మాయిలు, మహిళలు తెలంగాణ పరిధిలో ఎక్కడికైన ఉచితంగా బస్సులో ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, సరోజన, వల్లపు రాజు, ఆర్టీసీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకలో..

దుబ్బాకటౌన్: మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట ఆర్డీఓ రమేష్ అన్నారు. ఆదివారం దుబ్బాక బస్టాండ్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితతో కలిసి పథకాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా బస్సులో ఎక్కిన మహిళలకు జీరో చార్జి టికెట్లను అందించారు. కార్యక్రమంలో సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి, దుబ్బాక డిపో ఇన్‌చార్జి లింగంగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు రొట్టె రాజమౌళి, గుండెల్లి ఎల్లారెడ్డి, గన్నె భూంరెడ్డి, పల్లె రామస్వామిగౌడ్, పలువురు కౌన్సిలర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



దుబ్బాకలో పథకాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ రమేష్, తదితరులు



హుస్నాబాద్: జీరో టికెట్లను చూపిస్తున్న ఆర్డీఓ బెన్ షాలెమ్, మహిళలు

ఆరోగ్యశ్రీతో పేదలకు మెరుగైన వైద్యం



దుబ్బాక: వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ రమేష్, తదితరులు

హుస్నాబాద్/దుబ్బాక: నిరుపేదలు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా చేయూత పథకం ద్వారా రూ.10 లక్షల వరకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు పొందవచ్చని ఆర్డీఓ రమేష్ అన్నారు. ఆదివారం దుబ్బాక వంద పడకల ఆస్పత్రిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేయూత పథకాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, ఎంపీపీ పుష్పలత, జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమరాజ్ సింగ్‌తో కలిసి ప్రారంభించారు. అలాగే హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, భూక్య సరోజన, పున్న లావణ్య, వల్లపు రాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీకాంత్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ డాక్టర్ ప్రభాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

హుస్నాబాద్: త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరాడు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. హుస్నాబాద్ ఎమ్మెల్యే, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. హుస్నాబాద్‌లో బీసీ సంక్షేమ భవన్, ఫంక్షన్‌హాల్, వివిధ కులాలకు సంబంధించి కమ్యూనిటీ హాల్స్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బీసీ కార్పొరేషన్ రుణాలు కొన్ని కులాలకే కాకుండా అన్ని కులాలకు వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వెల్దండి సంతోష్, నాయకులు అనంత స్వామి, చొక్కాచారి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తాడూరులో 'కనువిప్పు' కార్యక్రమం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని తాడూరులో శనివారం రాత్రి చేర్యాల పోలీసుల ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. కళాబృందం సభ్యులు పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మూఢ నమ్మకాలు నమ్మవద్దని, చిన్న చిన్న తగాదాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే బ్యాంకు వివరాలు, ఏటీఎం కార్డు వివరాలు చెప్పవద్దన్నారు. అనంతరం ఎస్‌ఐ- 2 రామ్మోహన్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏదైనా చిన్న చిన్న సమస్య ఉంటే గ్రామ పెద్దలతో మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. సైబర్ నేరం జరిగిన వెంటనే ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే వెంటనే డయల్ 100, సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూం 8712667100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్ర ప్రేమల, ఉప సర్పంచ్ లక్ష్మణ్, కళాబృందం సభ్యులు బాలు, రాజు, రవీందర్, తిరుమల, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చౌడారంలో పేద ప్రజలకు వైద్య సేవలు అందించడానికి రూ. లక్షలు వెచ్చించి అన్ని హంగులతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నిర్మించారు. అందులో ఏఎన్‌ఎంతో పాటు వివిధ రకాల మందులు అందుబాటులో ఉంచారు. కానీ అధికారుల అనాలోచిత విధానాలతో భవనం ముందు ఇటీవల వేసిన బీటీ రోడ్డు ఎత్తు పెంచారు. దీంతో ఆస్పత్రిలోకి వెళ్లడానికి ప్రజలకు ఇబ్బందిగా మారింది. దీంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది. స్థానిక ఏఎన్‌ఎం గ్రామ పంచాయతీ భవనంలో విధులు నిర్వహిస్తోంది. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం



చౌడారంలో నిరుపయోగంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం

వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తితోనే మానసిక ప్రశాంతత సాధ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): అన్ని సేవల్లో భగవంతుడి సేవ గొప్పదని, భక్తి మార్గంలో ఉన్న ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత ఉంటుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గంగారంలో గ్రామంలో ప్రార్థనాలయానికి సంబంధించిన ఓ గృహం ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలసి హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ మమత, తదితరులు పాల్గొన్నారు.



సునీతారెడ్డితో మహ్మద్‌నగర్ గ్రామస్తులు

సందడిగా కార్తీక వన భోజనాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వ్యాస మహర్షి యోగా సొసైటీ, సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన భోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఉసిరి చెట్టు పూజ, గోమాత పూజ, సత్సంగ్, భజనలు నిర్వహించారు. ఈసందర్భంగా వ్యాసమహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాసరెడ్డి, యోగా గురువు తోట సతీశ్ మాట్లాడుతూ.. కార్తీక మాసంలో ఉసిరి చెట్టు కింద భోజనం చేయడం అనేక ఏళ్ల నుంచి ఆనావాయితీగా వస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, గౌరవాధ్యక్షుడు అంజయ్య, యోగా అసోసియేషన్ సభ్యులు చిప్ప ప్రభాకర్, తోట సంధ్య, విజయ, నందిని, శ్రీనివాస్, రాజ్‌కుమార్, సురేష్, సాయి తేజ, లింగమూర్తి, శశికిరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



కార్తీక వన భోజనాలకు హాజరైన ప్రజలు

సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని కోమటిబండ గుట్టపై కొలువుదీరిన సంగమేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం పురస్కరించుకొని పట్టణంలోని సంతోషిమాత దేవాలయం నుంచి సంగమేశ్వరస్వామి దేవాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. అక్కడ శివుడికి తులసీదాత్రి నారాయణపూజ నిర్వహించిన అనంతరం కార్తీకమాస వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో పాటు సంతోషిమాత దేవాలయ పూజారి రాజశేఖరశర్మ, భక్తులు పాల్గొన్నారు.



పాదయాత్రగా బయలుదేరి వెళ్తున్న భక్తులు

రసాయన ఎరువుల వాడకం తగ్గించండి

నర్సాపూర్‌రూరల్: రైతులు పొలాల్లో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని కేవీకే శాస్త్రవేత్తలు అన్నారు. ఆదివారం మండలంలోని సీతారాంపూర్‌లో రైతులకు సేంద్రియ ఎరువులపై కొడిపల్లి మండలం తునికి వద్ద డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్(కేవికే) కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త మల్లారెడ్డితో పాటు విద్యార్థులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమిలో తగ్గిపోతున్న సారాన్ని కాపాడినప్పుడే మంచి దిగుబడితో పాటు పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. అజోల్లా సాగు, తయారీ, ఉత్పత్తి, జాగ్రత్తలు, ఉపయోగాలు వివరించారు. అజొల్లా అంటే నీటి మీద తేలుతూ పెరిగే నాచులాంటిదని, పంట సాగులో పచ్చిరొట్టగా జీవన ఎరువుగా ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవికే విద్యార్థులు దేవిశ్రీప్రసాద్, అనుష్కరావు, ద్రిష్టి పాటిల్, బ్రింద, నితిషా, సంజన తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

వసతులు లేక.. పట్టించుకోక..



నిరుపయోగంగా ఉన్న టూరిజం భవనాలు

ఝరాసంగం(జహీరాబాద్): భక్తులు, టూరిస్టుల సౌకర్యార్థం నిర్మించిన టూరిజం భవన సముదాయం నిరుపయోగంగా మారింది. ఝరాసంగంలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయానికి వచ్చే భక్తులకు, పర్యాటకులకు ఇబ్బందులు తప్పడం లేదు. అన్ని హంగులతో నిర్మించినా ఇది వినియోగంలో రాలేదు. ఇవాళ పరిస్థితిని గమనిస్తే పూర్తిగా శిథిలావస్థకు చేరుకునే దశలో ఉంది. ఝరాసంగంలోని కేతకీ ఆలయానికి తెలుగు రాష్ట్రాలు సహా కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. అందులో భాగంగానే ఒక రోజు ముందుగానే ఆలయానికి చేరుకుంటారు. భక్తులకు తగిన వసతి లేకపోవడంతో పలు రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా కేతకీ సంగమేశ్వర ఆలయ ఆవరణలో భవన సముదాయాన్ని నిర్మించింది. 2011లో అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని రకాల వసతులతో కూడిన 10 గదులను ప్రారంభించింది. ప్రారంభంలో కొన్ని నెలల పాటు భక్తులకు సేవలు సవ్యంగానే అందాయి. తర్వాత సముదాయం నిర్వహణను కేతకీ ఆలయ అధికారులకు టూరిజం శాఖాధికారులు కొన్ని సంవత్సరాలపాటు అప్పజెప్పారు. ప్రస్తుతం టూరిజం శాఖ పరిధిలో ఉన్నట్లు సమాచారం. వారి నిర్వహణ లోపంతో గదుల తలుపులు పూర్తిగా విరిగిపోయి గదులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. ఇందులో కీటకాలు, విషపురుగులు సైతం సంచరిస్తున్నాయి. ఇవి నిరుపయోగంగా ఉన్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నా. కొన్ని నెలల క్రితం అధికారులు భవన సముదాయాన్ని పరిశీలించి, అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని భవన సముదాయాన్ని అభివృద్ధి చేయాలని, వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

కేతకీలో నిరుపయోగంగా టూరిజం కాంప్లెక్స్

టూరిజం శాఖకు అప్పగించాం

కొన్ని రోజులుగా కేతకీ పరిధిలో ఉన్న టూరిజం భవన సముదాయాన్ని టూరిజం శాఖ అధికారులకు అప్పగించాం. ప్రస్తుతం ఆలయ పరిధిలో లేదు. ఈ ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– శశిధర్, కేతకీ ఆలయ ఈఓ

సంక్షిప్త వార్తలు

◆ కబడ్డీ క్రీడాకారుల సమావేశం



హుస్నాబాద్‌రూరల్: మండల కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా శాతవేని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం కబడ్డీ క్రీడాకారులు పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా జనగామ కమలాకర్‌రావు, కార్యదర్శిగా సీహెచ్. చందు, కోశాధికారిగా కోతి యాదగిరి, సలహాదారులుగా వెంకటస్వామి, వీరస్వామి, రాజశేఖర్, తదితరులను ఎన్నుకున్నారు.

◆ త్వరలో అయ్యప్ప ఆలయ ప్రారంభం

దుబ్బాక: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని ఆలయ చైర్మన్ చింత రాజు పేర్కొన్నారు. ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహచార్యుల మంత్రోచ్చరణల మధ్య ఆదివారం అయ్యప్ప ఆలయ సింహ ద్వారం ఏర్పాటును ఘనంగా నిర్వహించారు.

◆ పండ్లు పంపిణీ



దుబ్బాక: ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం దుబ్బాక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎరుకుల స్వామి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నారాయణరెడ్డి, తిరుపతిగౌడ్, ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన నియామకం

దుబ్బాక: దుబ్బాక రజక సంఘం నూతన అధ్యక్షుడిగా కారంకంటి ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని రజక సంఘంలో నూతన కమిటీని ఎనుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కారంకంటి వెంకటేష్, కోశాధికారిగా పవన్, కార్యదర్శిగా లింగం, సభ్యులుగా నాగరాజు, స్వామి, మల్లేశం, శివరాజం, ప్రవీణ్, రాజు, తదితరులను ఎనుకున్నారు.